కథ

# చెట్టు కింది చుట్టము

ఐతా చంద్రయ్య



అమాయకుడైన భర్తను అదేపనిగా సాధిస్తున్న గయ్యాలి భార్యలా మే మాసం ఎండ చిటపటలాడ్తుంది. నున్నని తార్రోడ్డు సన్నని సెగలను భరిస్తూ హీరో హోండా మీద ఝామ్మని ఆఫీసు కెళ్తున్నాను. అదొక థ్రిల్లింగ్గా ఉంది.

మూడు దశాబ్దాల సర్కారు సర్వీసులో మూన్నాల్గు ప్రమోషన్లు సాధించడమొక ఎత్తైతే చివరి మజిలీగా సిద్ధిపేట పట్టణానికి ట్రాన్స్‌ఫర్ సాధించడం మరొక ఎత్తయింది. నాలుగేళ్లలో రిటైర్మెంటు ముంచుకొస్తుంది. అందుకే కోరుకున్న చోటకు ట్రాన్స్‌ఫర్... కోటి వరాల మూటలాగన్పించింది. ముగ్గురు పిల్లలు, ఆ ముగ్గురికీ పిల్లలు. ఎక్కడి వారక్కడ స్థిరపడి హాయిగా ఉన్నారు. మిగిలింది లింగు లిటుకుమంటూ మేమిద్దరమే చిలకా గోరెంకల్లాగుంటామండోయ్!

సొంత బంగళాలో సామానులు సర్దుతూంటే సరికొత్త అనుభూతి అలరించింది. ఎక్కడో డ్యూటీ చేస్తూ లోను తీసుకొని ఇక్కడ ఇల్లు కట్టడం... నిర్ణయం సరియైందేనని రుజువైంది. అటు అప్పుతీరింది, ఇటు సొంత గూటికి చేరుకున్నాము. అప్పటిదాకా అదే ఇంట్లో అద్దెకున్న ఆఫీసర్ గూడా వాళ్ళూరికి ట్రాన్స్‌ఫరైపోయాడు. లేకపోతే సొంతిల్లు ఉండగా అద్దె ఇల్లు కోసం సర్వే చేయాల్సి వచ్చేది. అందుకే అంది శ్రీమతి.

''ఎప్పట్నుంచో చేస్తున్న ట్రాన్స్‌ఫర్ ప్రయత్నం ఇప్పుడు ఫలించింది. పైవాడి పంచలో ఆలస్యమ యిందిగాని అంధకారం లేదంటారండీ''

వచ్చీపోయే వాహనాలనధిగమిస్తూ ముందు కెలుతున్నాను. గూటిలో చిలకలా జేబులో సెల్‌ఫోన్ గొంతు విప్పింది. హోండాను రోడ్డు పక్క చెట్టుకిందికి తీసుకెళ్ళి ఆపేశాను. ఫోన్ మాట్లాడి పక్కకు చూశాను. ఫుట్‌పాత్ మీద వరుసగా రేకుల షెడ్లు, గుడిసెలున్నాయి. దినదినగండం నూరేళ్లాయుష్షులా జీవిస్తున్న సన్నకారు జీవులకవి ఆశ్రయాలని తెలిసి పోయింది. చెట్టు ఇటువైపు నీడలో నేనున్నాను. అటువైపు నీడలో మట్టిగోడల తాటాకు గుడిసె. గుడిసె ముందు మండుతున్న కొలిమి పక్కన ఓ ముసలాయన, బాగా కాలిన గడ్డపార మొనను పట్టకారు సాయంతో పట్టుకుని కూచున్నాడు. అతనికెదురుగా తల పండిన ముసలామె పెద్ద సుత్తి గాల్లోకెత్తి గడ్డపార మొనమీద దెబ్బలేస్తోంది.

ముసలాయన పీటలాంటి రాయిమీద కూచు న్నాడన్నమాటేకాని దెబ్బ దెబ్బకూ ముందుకూ, వెనక్కూ కదుల్తూ గడ్డపారనటూ, ఇటూ తిప్పుతు న్నాడు. గడ్డపార మొన నిప్పులతో బాగా చెలిమి చేసిందేమో, అదిగూడా నిప్పు కణికలాగుంది. దెబ్బ దెబ్బకు రూపం మార్చుకుంటూ మొనదేలుతోంది.

ముసలాయన మొహమ్మీదికి, గొంతు, మెడల నుండి శరీరం నిండా చెమట ధారలు కట్టింది. ముసలామె ఒంటినిండా గుడ్డలున్నాయి గాని అవి చెమటకు తడిసి శరీరానికతుక్కు పోతున్నాయి. దెబ్బ దెబ్బకూ దమ్ము తీస్తోంది.

''వెయ్యవే వెంకు. దెబ్బ గట్టిగా పడనీ'' ముసాలయనన్నాడు.

''ఏస్తున్నానయ్యా. పొట్ట తిప్పలుకు జెర్రిపోతు లాడించినట్టు గీ వైసులగూడా రెక్కల కష్టం తప్పక పాయె'' ముసలామె నిట్టూర్పు కొలిమిలో నిప్పుల మంటలు. ముసలోళ్ళ కడుపులో ఆకలి మంటలు. శ్రమైక జీవన సౌందర్యమంటే ఇదేనేమో!

మళ్లీ సెల్‌ఫోన్ మోగింది. ఆఫీసునుండి డిప్యూటీ పోస్ట్ మాస్టర్....

''సార్! పది కాబోతుంది. కౌంటర్లో జనాలున్నారు ట్రెజరీ తాళాలు....''

''వస్తున్నా. రెండు నిమిషాల్లో ఆఫీసులో ఉంటా''

రోజూ అందరికంటే ముందు ఆఫీసుచేరడం, కంప్యూటర్లను స్వయంగా ఓపెన్ చెయ్యడం, సిబ్బంది హాజరీని పర్యవేక్షించడం, ట్రెజరార్ రాగానే ఇద్దరమూ కలిసి స్ట్రాంగ్ రూం తెరవడం... హెడ్ పోస్ట్‌మాస్టర్‌గా నా బాధ్యత అని తెలుసు. అందుకే తొమ్మిదిన్నరకే ఆఫీసు చేరడమలవాటైంది, కాని ఈ రోజు మాత్రం సామానులు పూర్తిగా సర్దడములో శ్రీమతికి సాయ మందించడం తప్పనిసరైంది... నాకు నేనే సమా ధానం చెప్పుకుంటూ బయలుదేరాను.

★★★

''... కానీ.... గుడిసె పీకిపారెయ్యండి''

''అయ్యా! వద్దయ్యా! దిక్కులేనోళ్ళం... నీ బాంచెనయ్యా''

''అదేంలేదు. ముందు తాటాకులు లాగెయ్యండి''.

''దొరా! కాల్మొక్తదొరా! ముసలోల్లం... దొరా!'' ఆడగొంతు.

రోడ్డు పక్కన అదే చెట్టుకింది జనం గుంపులు... జాతర లాగుంది. ఏడుపులు, పెడబొబ్బలు, తిట్లు, చీత్కారాలు.... గందరగోళంగా ఉంది. రేకుడబ్బా షాపులు, పక్క గుడిసెలు, సామానులు చిందర వందరగా పడున్నాయి. అదేమిటో చూడాలనే ఆసక్తి హీరోహోండానో పక్కన పెట్టేసి గుంపులో దొరబడ్డాను.

ముసలోళ్ళ గుడిసె చుట్టూ నలుగురు గడ్డ పారలు పట్టుకుని ఉన్నారు. తాటాకులు పీకేస్తు న్నారు. ముసలి మనుషులు గోడు గోడుమంటు న్నారు. నలుగురి పక్కనున్నాయన సూటు బూటులో... ఆఫీసర్లాగున్నాడు. ''ఊఁ... కానివ్వండి. ఖాళీ జాగాలన్నీ చిల్లెరగాళ్ళు గిట్లా అలుముకుంటే మన మున్సిపాల్టి చూసుకుంట కూచుంటదా! కానీ...'' పురమాయిస్తున్నాడు.

వాళ్లు మున్సిపల్ సిబ్బంది అని అర్థమైపోయింది.

తమాషా చూస్తున్న వారిలో సవాలక్ష భావాలు.

''పాపం! గీ ముసలి దంపతులు మూన్నాలు గేండ్లనుంచి ఉంటున్నారు. కాయకష్టం చేసుకుని బతుకుతున్నారు'' ఓ నడివయసామె బుగ్గలు నొక్కుకుంది. మగవారిని ఎగాదిగా చూస్తూ–

''ఇన్ని రోజులు మూలకు కూకుండి గిప్పుడు ఉరికొచ్చింద్రు....''

ఓ యువకుని వ్యాఖ్యానం.

జనాలు కామెంట్సు విసురుతున్నారు. తప్పు ఎవ్వరూ ముందుకెళ్లి అడగడం లేదు. కొందరు పక్కన పడున్న కొలిమి తిత్తిని కాళ్లతో తడుతున్నారు. ముసలోళ్లు బతిమాలుతూనే ఉన్నారు. అధికారి ఆదేశాలను అమలు చెయ్యాలని సిబ్బంది ప్రయ త్నిస్తున్నారు కాని ముసలోళ్లు ప్రతిఘటిస్తున్నారు.

''అరే ముసలోడా!'' అధికారికి కోపమొచ్చి నట్టుంది. ఈ జాగా నీ అబ్బ జాగీరనుకున్నావా? జరుగూ...'' హెచ్చరించాడు.

''కాద్దొరా! దిక్కులేనోల్లం దొరా'' ముసలామె అధికారి కాళ్ళు పట్టుకుంది. బతిమాలుతూనే ఉంది. అయ్యో.... పాపం!

''నీయవ్వ! గిట్లా కాళ్లు పట్టుకునుడు... చాలా చూసినం గాని గుడిసె పీక్కుని పొండ్రి. లేకపోతే పోలీసులొచ్చి మిమ్మల్ని పట్టుకపోతరు. ఇది సర్కారు జాగా తల్లీ'' వెటకారంగా మాట్లాడ్తూ అధికారి నావైపు తిరిగాడు. ఆశ్చర్యం.... ఉత్సాహం... ఆ అధికారి... మా క్లాసుమేటులాగున్నాడు. అడు గులు ముందుకు పడినై.

''సార్... నవ్వు... ప్రేమానందం కదూ!'' అడిగాను ఆబగా.

''అవును... నువ్వా!'' చెయ్యందుకుని కర చాలనం చేశాడు. ''సరేగానీ... ఇప్పుడెక్కడున్నావ్. ఎంత సర్వీసుందిరా?''

వర్కర్సు పని ఆపేసి మావైపు చూస్తున్నారు.

''అవన్నీ తర్వాత చెప్తాగాని... పాపం! వీళ్ల సంగతేమిటి?''

''ఏం లేదురా! గిసొంటి చెల్లెరగాళ్లంతా మున్సి పల్ జాగల నాక్రమించుకుంటున్నారు. కొందరు లీడర్లు కలెక్టర్‌కు కంప్లైంటు చేస్తున్నారు. కొందరేమో గీ గరీబోల్లకు సపోర్టు జేస్తున్నారు. పై అధికారులు మమ్మల్ని మందలిస్తున్నారు. అరెరే... గిసొంటి నైకరి చేసే బదులు బస్టాండ్ల బటానీలమ్ముకోవడం నయమన్పిస్తుందిరా'' గోడు వెళ్లబోసుకున్నాడు.

''ఎవరి నౌకరి వారికి అట్లానే అన్పిస్తుందిరా! సరేగాని మరిప్పుడేం జేస్తున్నరు?


''ధైర్యంజేసి గీ ఆక్రమణదారుల్ని తొలగిస్తున్నం'' ముసలిజంట వచ్చి నా కాళ్ళు పట్టుకున్నారు.

''దొరా! నువ్వన్నా చెప్పు దొరా! పొట్ట చేతుల పట్టుకోని పల్లెటూరు చింతమడక నుండి వచ్చినం. రెక్కలు ముక్కలు జేస్కుంటున్నం'' ముసలాయన గోడు.

''దొరా! నాలుగైదేండ్ల నుంచి ఉంటున్నం. కష్టపడి గుడిసె ఏసుకున్నం.'' ముసలామె లేచి మా ఇద్దరికీ దండం పెట్టింది.

''మున్సిపాల్టోల్లకు నెలనెలా ఇస్తున్నం దొరా! గీ ముసలి వైసుల ఎక్కడికి పోవాలె? ఏం జెయ్యాలె? రెండు మూడు నెలలైనంక ఖాళీ చేస్తం దొరా!'' ముసలాయన గూడా బతిమాలాడు.

అయ్యోపాపం! కడుపులో పేగు కదిలిపోయింది. ఈ ముసలోళ్ళు ఊరిడిచి వచ్చారన్నమాట! మేమి



ద్దరం మొహాలు చూసుకున్నాము. కమీషనర్ను పక్కకు తీసుకెళ్ళి

"ప్రేమా!" చిన్నప్పటి అలవాటు ప్రకారం సంబోధించాను.

"పాపం! వీళ్ళు నాకు బాగా తెలుసు. గింత పెద్ద వయసుల గూడా ఎండనకా, వాననకా శ్రమిస్తున్నరు. చెమటోడ్చి కడుపు నింపుకుంటున్నారు. వాళ్లడిగిన టైమిస్తే బాగుంటుంది గదా"! నచ్చజెప్పాను.

ప్రేమానందం మనసులోగూడా ఏదో జరుగుతున్నట్టుంది. అతని దష్టి పక్కనే ఉన్న వర్కర్ల వైపు మళ్లింది.

"ఇంతకు ముందు గూడా టైమిచ్చినం సార్!" సబార్డినేటు గుర్రుమన్నాడు. ప్రేమానందాన్ని సూటిగా చూస్తూ ప్రేమానందమేమో-

"చూడ్రా! నువ్వేమో బాల్య స్నేహితుడివి. క్లాసుమేట్సుము. మా ఇన్స్పెక్టరేమో ఇంతకు ముందే టైమిచ్చినమంటున్నడు.... ప్చ్....." చూపులు నేలకు వాల్చాడు.

కమీష్నర్ ప్రేమానందం మొహమాటపడుతున్నాడో, మూతి విరుస్తున్నాడో అర్థంకాలేదు.

"పోనీ! ఈసారి ఫైనల్ వార్నింగిచ్చి, అడిగిన టైమిస్తేసరి...." అంతకు మించి ఇంకేమీ అనలేకపోయాను.

"సరే....!"నన్నాడు. సిబ్బందితో సహా వెళ్తూ ఆగి-

"నువ్వోసారి మా ఇంటికి రారా! సావకాశంగా మాట్లాడుకుందాం" మళ్లీ కరచాలనం చేశాడు.

కరచాలనం కమ్మని అనుభూతినిచ్చింది. తియ్యని బాల్య స్మృతుల్ని నెమరుకు తెచ్చింది. హైస్కూల్లో స్వేచ్ఛా జీవితంలో ప్రేమానందంతో కలిసి క్రికెట్ ఆడుకున్న దృశ్యాలు కళ్లలో కదలాడినై. ఆ బాల్యం మరోసారి వస్తే ఎంత బాగుండేదో!

★★★

ఆ రోజు ఆదివారము. ఆఫీసుకెళ్లాల్సిన అగత్యం లేదు కాని ఆ రోజు గూడా ఎంతో కొంత పంజేస్తేనే పెండింగ్ లేకుండా ఉంటుంది. ఓ పూట ఆఫీసులోనే గడిపేస్తే ఎండాకాలంలో చల్లని నీటితో తలస్నానం చేసినట్టు తృప్తిగా ఉంటుంది. అలవాటు ప్రకారం ఉదయం ఆఫీసుకెళ్ళి కంప్యూటర్ ముందు కాయి తాలేసుకుని కూచున్నాను. పదకొండు గంటలకు వాచ్‌మెన్ అందించిన చాయ్ సేవించాను. వేడి చాయ్ జరజరా నరాల్లోకి పాకి ఉత్సాహాన్నిచ్చింది. అలాగే... పనిలో మునిగాను. పన్నెండింటికి క్లియరైపోయింది. కొన్ని క్వింటాళ్ల బరువు నెత్తిమీంచి దించుకున్నట్టైంది. ఒళ్లు విరుచుకుని లేచాను. హీరో హోండాతో బయటికొచ్చాను.

ఇంతసేపు నన్ను మరిచినందుకు నీకిదే శిక్ష అన్నట్టుగా ఎండ నిప్పులు కక్కుతోంది. తార్రోడ్డు దగదగా మెరిసిపోతోంది. హోండా మీద హుందాగా వెళ్తున్నాను.

"సారూ! ఓ సారూ!" ఎడమ పక్కనుంచి పిలుపు వినబడింది.

బండి ఆపి తిరిగి చూద్దునుగదా... రోడ్డుపక్క చెట్టుకింద ముసలాయన. పొడగాటి తెల్లని గడ్డాన్ని నాజూగ్గా నిమురుకుంటూ " ఇయ్యాల ఆదివారం గదా?" అడిగాడు అర్థవంతంగా.

"దివారమైనా ఆఫీసు పని తప్పలేదు తాతా" అంటూ చెట్టు నీడలో బండి దిగాను. గుడిసెలోంచి ముసలామె బయటికొచ్చింది. కళ్లలోకి ఎండ చొరబడకుండా అరచెయ్యి అడ్డం పెట్టుకుని

"నువ్వా... లోపలికి రారాదూ!" అంది ఆప్యాయంగా.

విశ్రాంతి తీసుకుంటున్న వస్తాదులా కొలిమి చల్లగా ఉంది. హడావుడేమీ లేదు. పక్క డబ్బా షాపులవాళ్లు బిజీగా ఉన్నారు.

రెక్కల కష్టాన్ని నమ్ముకున్న శ్రమ జీవుల డిక్షనరీలో విశ్రాంతి, సెలవు అనే పదాలకు అర్థాలు వేరుగా ఉంటాయని గుర్తుకొచ్చింది.

"దివారం మీగ్గూడా సెలవా?" చిరునవ్వుతో అడిగాను.

"కాదుగానీ... ఇయ్యాల్ల అమావాస్య గదా! అమావాస్యనాడు మేమే పంజెయ్యము. మా పనికి సాయపడ్తున్న అతారలకు (పనిముట్లు) పూజ చేస్తాము. పూజ చేసి, ఇప్పుడే అన్నందిని నేను బయటికొచ్చి చెట్టు నీడల నిల్చున్న. నువ్ కన్పించినవు. అంతే...!" ముసలాయన మురిపెంతో సంతోషంగా చిరునవ్వు చిందించాడు.

"అయ్యోరామా! నాజూకు మనుషుల్ని ఎండ సతాయిస్తదిగదా! రా.. లోపలికి పోదాం!" అంటూ చెయ్యందుకుని తీసుకెళ్లాడు.

పక్కషాపులవాళ్లు వింతగా చూస్తుండడం ఓరకంటితో గమనించాను.

గుడిసెలో వెనకభాగం.... ఓ పక్క వంటసామాగ్రి, మరోపక్క ప్లాస్టిక్ బకెట్లు, నీళ్లకుండ, సత్తుగిన్నెలు, చాప.... ఇంకేవో సుత్తి, పట్టకారులాంటి పనిముట్లు మరోవైపున్నాయి. వాటిమీద కుంకుమ, పసుపు, పూవులున్నాయి.

ముసలామె చాప పరిచింది. ముసలాయన నవ్వుతూ కూచొమ్మని సైగచేశాడు. ముప్పయ్యేడేళ్ల వయసులోనే మోకాలు నొప్పులు పలుకరిస్తున్న కాలమిది. నేలమీద కూచుండాలా! తప్పదు. పాంటు, ఇన్షర్టును పరకాయించి చూసుకుంటూ కూచున్నాను. నీళ్ల గ్లాసు చేతికిచ్చి నాకెదురుగా కూచున్నారు. చల్లని కుండనీళ్లు... గటగటా తాగేశాను. ప్రాణం చల్లబడింది.

"మొన్న నువురాకపోతే మా బతుకు ఆగమైపోయేది" ముసలాయన కృతజ్ఞతగా నా కళ్లలోకి చూశాడు.

"మీదే ఊరు బాబూ?" ముడతల మొహమ్మీది ముంగురుల్ని ఎగదోసుకుంటూ అడిగింది ముసలామె.

"మా ఊరా!... అదీ...." పసి ప్రాయంలో గంతులేసిన నేల, పచ్చని పొలాలు, మోటపాటలు, దూడేకుల ఝుంఝుంలు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, నేత పనివారల స్వేదబిందువులు, శ్రమ గీతాలు మనసు తెరమీదోక్షణం ప్రత్యక్షమై, మాయమై పోయినై. జీవన పోరాటంలోని ఆశల ఆరాటంతో మా ఊరి జ్ఞాపకాలు మరుగున పడిపోయినైగదా! అమృతం సేవించిన అనుభూతి... నోటమాటరాలేదు.


"చెప్పు బాబూ, మీదే ఊరు? ఎందరు పిల్లలు? ఏంజేస్తున్నారు?" ముసలాయన ప్రేమ మరికొన్ని ప్రశ్నలను జోడించింది.

చేసిన సాయాన్ని చచ్చినా మరువదీ పెద్ద తరం... అనుకున్నాను.

"మాది మీ ఊరే.... మా ఊరు చింతమడక తాతా!" మా అమ్మా, నాన్నల పేర్లుగూడ చెప్పేశాను.

"అరెరే... నువ్వా!" ముసలామె కళ్లు విశాలమైపోయినై. కుడిచేయి చూపుడు వేలు ముక్కుమీదుంది. ముగ్గుబుట్టలాగున్న తల వెంట్రుకలు మళ్లీ నుదుటి మీద కదుల్తున్నాయి. "ఏమయ్యా! యాదికుంగా... ఈ పిల్లగాడు మన వాడకట్టు వెంకట్రామయ్య కొడుకు. చిన్నప్పుడు చీమిడి ముక్కుతోని మనింటి ముంగట, కొలిమి దగ్గర ఆడుకుంటుండె...." ముసలాయనకు గుర్తుచేసింది.

"ఓర్నియవ్వ! నువ్వారా పిల్లగా!" ముసలాయన ముడతల మొహం పుచ్చపువ్వులా విచ్చుకుంది. చదువుకోసం చిన్నప్పుడే ఊరు దాటినవుగదా! కళ్లల్లో ఆనందం. నా చేతులందుకుని కళ్లకద్దుకున్నాడు. అదొక దివ్యమైన అనుభూతి... గుర్తుకొచ్చింది.



# ముంబై మోజులో అసిన్!

కొన్ని ప్రాంతాలంటే కొంతమంది నటీనటులకు ఎంతో అభిమానం. అటు తెలుగు, ఇటు తమిళంలో తనకంటూ ఓ ఇమేజ్‌ని సొంతం చేసుకున్న నటి అసిన్. బాలీవుడ్‌లో రీమేక్ అవుతున్న గజిని చిత్రం కోసం ఈ మధ్య ముంబైలో వుంటున్న అసిన్‌కి ఆ నగరం మీద ప్రేమ పుట్టింది. అంతేకాదు ఇకనుంచి ముంబైలో కూడా కొన్నాళ్లపాటు వుండాలని భావిస్తోంది. ఇంకో సంగతేంటంటే ఈమధ్య జరిగిన క్రిస్మస్ వేడుకల్లో బాలీవుడ్ హీరో అమీర్‌ఖాన్‌తో కలిసి పాల్గొంది కూడా. బాలీవుడ్‌లో మంచి ఆఫర్లు వస్తే చెన్నైనుంచి మకాం మార్చేసి ముంబైలో స్థిరపడాలనుకున్నట్టు సినీవర్గాల భోగట్టా.



''మీరు కమ్మరి మల్లమ్మ – మల్లయ్య తాతలు గదా'' హుషారు...

''అవున్రా మనవడా!'' నాకుడి చేతి మీద ముద్దుబెట్టుకున్నాడు.

''గదేందయ్యో! ఇప్పుడీ బాబు ఆనాటి బుచ్చి పోరడుకాదు. పెద్దమనిషి గట్ల రారా, పోరా అంటవా. తప్పు'' లెంపలేసుకుంది.

''అదేం లేదమ్మా, ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్టు నేను మీ కండ్లముంగటి పిల్లగాన్నేగదా! పిలవనీ'' ఆనందాన్ని పంచుకుంటున్నాను. ముసలి జంట కళ్ల వెలుగుల్ని మనో నేత్రాలతో ఏరుకుం టున్నాను. ఆ తర్వాత–

''మీరెందుకు ఊరు విడిచి పెట్టింద్రు? మీ పిల్లలెక్కడున్నారు? ఏం జేస్తున్నరు?'' ఆత్రంగా అడిగాను.

''ఏం జెప్పాలె నాయనా!'' మల్లయ్య భారంగా నిట్టూర్చి గుడిసె గోడకు ఒరిగి కూచున్నాడు. మల్లమ్మ అతని పక్కకు జరిగింది. మొహాల్లో గాంభీర్యం, నుదుటిగీతలు, నరాలు తేలిన మెడలు... గతాన్ని నెమరువేసుకుంటున్న చూపులు... ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధించినా, ఏ చిత్రకారు డన్నా కాన్వాసుమీద గీసినా గొప్ప కళాఖండమై తీరుతుంది. బయటి ఎండ ప్రతాపం మా కళ్లను జిగేల్‌మన్పిస్తుంది. గాలి ఆసరా కరువై చెట్టు మౌన తపస్విలాగుంది. కొమ్మలు – రెమ్మలు, ఆకులు గూడా కదలడం లేదు.

నాకు ఉక్కగా ఉంది. నా అవస్థను పసికట్టిన మల్లమ్మ విసనకర్ర అందించింది. విసనకర్రగాలి కన్నతల్లి స్పర్శలా... హాయిగా ఉంది.

''చెప్పు తాతా! ఇదే కమ్మరి పని మనూర్లె చేసుకోవచ్చుగదా!'' ఆసక్తి కట్టలు తెంచుకుంది.

''ఇప్పుడు మనూర్లె మాతోని పన్లేదు బాబూ!''

''ఏం... ఎందుకూ?''

''ఎందుకంటే కొన్ని సంవత్సరాలనుండి మన దిక్కు వానలు లేవు. చెరువులు – కుంటలు ఎండి పోయినై. యవసాయం పనుల్లేవు. మాకూ పను ల్లేవు.'' మూడు ముక్కల్లో రామాయణంలా చెప్పాడు.

''అట్లెట్లా? రెండేండ్లు వానలు పడినైగదా!'' నా సందేహం.

''నిజమే. పూర్తి వానలు పడలేదు బాబూ! చెరువులు – కుంటలు పూర్తిగ నిండలేదు. కొద్దిపాటి నీళ్లతోని కొందరే యవసాయం చేసింద్రు. వాళ్లు గూడా ట్రాక్టర్‌తోని పొలం దున్నించుకున్నారు. నాట్లకు, వరి కలుపుకు, పంటకోతకు... అన్నింటికి మిషెన్లు వచ్చినై. ఇంగ నాగండ్లు, కొడవండ్లు, పారలు, గడ్డపారలు వాళ్లకెందుకు? ప్రతి పనికి పట్నం నుంచి మిషెన్లు వస్తుంటే మాకేం పని దొరుకుతుంది? దాంతోని ఖర్చుగూడా తక్కువనటా... గందుకే బతక లేక ఊరిడిచి వచ్చినం.'' మాటల్లో బాధ వ్యక్తమైంది.

''మరిక్కడ చేతినిండా పనెట్లా దొరుకుతుంది?''

''ఇక్కడ ఇండ్లు, బంగ్లాలు కడ్తున్నారు గదా!'' మల్లమ్మ తడి కళ్లను కొన కొంగుతో అద్దుకుంది. గా పనులకు తాపీలు, పారలు, గడ్డపారలు కావాలె గదా! గా పనులే వస్తున్నయి.

''అట్లానా! ఇండ్లు, బంగ్లాలకు కిటికీలు, తలుపు కావాలెగదా! వాటికోసం ఉలి, బాడ్సె, దూశోడలు గూడా కావాలెగదా! ఆ గిరాకి గూడా వస్తుందా?''

''గదెందుకు కొస్తదయ్యా బాబూ!'' ముసలాయన పెదాల మీద నిర్వేదపు చిరునవ్వు మెరిసింది. ''దూశోడ పట్టేందుకు, తొలి కొట్టేందుక్కూడా మిషెన్లు వచ్చినైగదా! ఎవలో చిన్న చిన్న పనోళ్లు చిన్న చిన్న పనులకొస్తున్నారు. పల్లెల్లల్ల మిగిలిన వడ్డోల్లు, చిన్న యవసాయదార్లుగూడా ఇక్కడికే వస్తున్నారు. వస్తువులు చేయించుకు పోతున్నారు. ఎండా వాన, చలికి అలవాటు పడినం. బట్టా పొట్టకు తిప్పలు లేదు.'' తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

పాపం! జీవన సంధ్యా సమయంలో గూడా రెక్కాడితేగాని డొక్కాడదు. అనారోగ్యంతో మంచాన పడితే... ఎలా?

''రోజుల్లో గ్రామీణ రోజ్‌గార్ యోజన, వృద్ధాప్య పింఛన్లు స్కీములొచ్చినైగదా! గవర్నమెంటు సాయం మీకేమీ లేదా?''

''గవన్నీ మాకేమీ తెల్వదు బాబూ!'' కొత్త మాట విన్నట్టు వింతగా చూశాడు.

''మరి... మీ పిల్లలు, భూములు, ఇల్లూ....!'' మల్లమ్మ కళ్లలోకి చూస్తూ అడిగాను.

''మాకు భూముల్లేవ్ నాయనా!'' మల్లమ్మ కొంగు సర్దుకుంది.

''నీటి కరువు లేనప్పుడు మాతోని పనిచేయిం చుకున్న యవసాయదార్లు ఏ పంట పండించుకున్నా దాంట్లనుంచి మాకు కొంత పంపించిరి. మాక్కావ లసినన్ని ఉంచుకుని మిగతావి అమ్మేస్తిమి. మా తాత ముత్తాతల నుండి కాలం హాయిగా గడిచింది. గిప్పుడే నడమంత్రపు దరిద్రమొచ్చింది.''

''మరి .... మీ ఇల్లూ, పిల్లలూ?''

''మా కొక్కడే కొడుకు పెద్ద చదువు అంట లేదు. ప్రేమతోని పెంచినం. ఊర్లె వానికేమీ దొరక లేదు. దుబాయ్ పోవాలని మా ఇల్లు అమ్మి పైసలన్నీ దలాలోనికిచ్చిండు. వాడు మోసం జేసిండు. మాయమైపోయిండు. పైసలు మునిగినై. మా కొంప మునిగింది. అమ్మిన ఇంట్లనే కిరాయి కుంటిమి. అదే ఇంట్ల మా కొడుకు... ఉరేసుకుని చచ్చిపోయిండు నాయనా....'' మల్లమ్మ గొల్లుమంది.

మల్లయ్య తాత నెత్తి కొట్టుకున్నాడు. నా గుండె బరువెక్కింది. మనసు వికలమైంది.

బయటి ఎండ మరింత ఉగ్రరూపం ధరించింది. ముసలి దంపతుల బాధ బలంపుంజుకుంది.

నాదేశంలో ఇలాంటి ఆగం బతుకులెన్ని ఉన్నాయో! భగవంతుడా! కొందరికన్నా సాయం చేయగల శక్తి – యుక్తులు ప్రసాదించు.

★